క్లుప్తంగా

రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వం రిజర్వేషన్లపై సీలింగ్‌ను ఎత్తివేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు బీమ్‌సేన్, వేణుగోపాల్, కీర్తి, బిక్షపతి, చంద్రమౌళి, రాజేశం, రాజన్న చారి పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగారపు లింగమూర్తి డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయంలో శనివారం ఏరియా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే ఉద్యోగాల ప్రమోషన్లలో ఆర్‌ఓఆర్ తప్పకుండా అమలు చేయాలన్నారు. ఇంకా ఇతర న్యాయపరమైన హక్కులను సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు నీలబోయిన కుమార్, ఏరియా కార్యదర్శి కంబల నాగయ్య, నాయకులు సురేష్, చెన్నూరి శ్రీనివాస్, మారుపెల్లి బాబు పాల్గొన్నారు.

ఓంకార్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతాం



జోహార్లు అర్పిస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ చూపించిన మార్గంలో ఉద్యమిస్తామని, ఆయన ఆశయాలను తుది వరకు కొనసాగిస్తామని ఎంసీపీఐ(యూ) నాయకులు పేర్కొన్నారు. ఓంకార్ 16వ వర్ధంతిని బెల్లంపల్లిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ)నాయకులు ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ)జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేష్, శ్రేణులు రమేష్, రాహుల్, సతీష్, రాజు, శ్రీను, మంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ ఏరియా ఇంటర్నల్ ఆడిట్ విభాగానికి నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. శనివారం యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదాలు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ కార్యదర్శిగా గడ్డల రాజు, సహాయ కార్యదర్శిగా దాసరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సామల నరేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కొట్ల మల్లేష్, పోతూరి మౌనిక, కార్యవర్గ సభ్యులుగా పీ హరి, కటకం రమేష్, రావుల ప్రియాంక, జీ శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఇంటర్నల్ ఆడిట్ విభాగంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎంఈవోతో బయోమెట్రిక్ నమోదు చేయాలి

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం కోసం ఎం.ఎల్.ఎస్. పాయింట్ వద్ద ఎంఈవోతో బయోమెట్రిక్ నమోదు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సీఆర్పీ నర్సయ్యకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్ రావు శనివారం వినతిపత్రం అందించారు. బయోమెట్రిక్ వేసేందుకు ప్రతినెలా లక్సెట్టిపేటకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు.

వీధి కుక్కల హల్‌చల్..!

- బెల్లంపల్లి బల్దియా రాంనగర్ బస్తీలో ముగ్గురిని గాయపర్చిన శునకాలు
- కరువైన సంతానోత్పత్తి చర్యలు
- కనీసం కట్టడి చర్యలు చేపట్టని మున్సిపల్ అధికారులు
- వీధి కుక్కల సంచారంతో వణికిపోతున్న పుర ప్రజలు



బెల్లంపల్లి మార్కెట్ వద్ద గుంపుగా వీధి కుక్కలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి.రోడ్లు, వీధులు, గల్లీల్లో తిరుగుతూ రెచ్చిపోతున్నాయి. అదునుచూసి మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. శనివారం మున్సిపల్ 27వార్డు పరిధి రాంనగర్ బస్తీలో ఒక్కరోజే ముగ్గురిపై శునకాలు దాడి చేశాయి. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న నాలుగేళ్ల సహజ అనే చిన్నారి నడుముపై దాడి చేసి కొరికాయి. కుక్కలను చెదరగొట్టే యత్నం చేయడంతో 65ఏళ్ల ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి చేతిని కరిచాయి. చిన్నారి బాలిక, వృద్ధురాలిపై దాడి చేయడంతో అడ్డుకునే చర్యలకు పాల్పడిన నరేష్ అనే యువకుడి నుదిటిపై సామూహికంగా ఎగబడ్డాయి. అతడి తలను కొరికి తీవ్రంగా గాయపర్చాయి. ఈ తీరుగా ముగ్గురిపై శునకాలు దాడికి దిగి రక్తం కళ్లజూశాయి. ఆ బాధితుల గాయాల నుంచి తీవ్ర స్థాయిలో రక్తస్రావం కావడంతో వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు వారంలో గరిష్ఠంగా నాలుగైదు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా, నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లిప్తతంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చిన్నాపెద్దా తారతమ్య బేధం లేకుండా కనిపించిన ప్రతి ఒక్కరిపై దాడి చేసి గాయపరుస్తుండటంతో ఇంట్లో నుంచి కాలు బయట పెట్టడానికి ప్రజలు జంకుతున్నారు. కుక్కకాటుకు బలైతే తప్పా స్పందించరా అని మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై పురప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీ వ్యాప్తంగా ...

మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. వీటన్నింటిలోనూ శునకాల సమస్య ఉంది. వీధి కుక్కలు రోడ్లమీద, వీధుల్లో, గల్లీల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా కనిపించిన, సైకిల్, బైక్‌పై వెళ్తున్నా సరే వెంబడించి గాయ పరుస్తుండటం సర్వసాధారణ సమస్యగా మారింది. కాంటా చౌరస్తా, బజారు ఏరియా ప్రాంతాల్లో, రోడ్లపై రేయింబవళ్లు సంచరిస్తున్నాయి. ఒక్కోసారి వేగంగా పరుగెత్తుకొచ్చి వాహనాలకు అడ్డం పడి ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. కూరగాయల మార్కెట్‌కు ఇతరత్ర అవసరాల కోసం బయటకు వెళ్లడానికి మహిళలు, వృద్ధులు భయంభయంగా రోడ్డు కెక్కాల్సి వస్తుండగా, ఇంటి నుంచి స్కూల్‌కు నడిచి వెళ్లడానికి బాలబాలికలు వణికిపోతున్నారు.

నియంత్రణ చర్యలేవి..?

వీధి కుక్కల నివారణకు మున్సిపల్ పరంగా చర్యలు లేకుండా పోయాయి. ఏటా సంతానోత్పత్తిని పెంచుకుంటున్న వీధికుక్కల నియంత్రణకు క్రమం తప్పక శస్త్ర చికిత్సలు చేయించాల్సి ఉన్నా ఆ దిశగా యోచించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దాడులకు తెగబడుతున్న వీధి కుక్కల కోసం ప్రత్యేకంగా గృహ నివాసాలకు దూరంగా షెడ్లను నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రజలపై వీధి కుక్కలు ఎగబడి సాగిస్తున్న దాడులు, గాయాలను తేలికగా తీసుకుంటున్నారే తప్పా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బల్దియాలో కుక్కకాటు కేసులు

నెల	కుక్కకాటు కేసులు
జూన్	49
జులై	46
ఆగస్టు	50
సెప్టెంబర్	28
అక్టోబర్	31(19 తేదీ వరకు)
మొత్తం	204

చర్యలు తీసుకోవడం లేదు



మున్సిపల్ అధికారులు వీధి కుక్కల సంతానోత్పత్తి నివారణ చర్యలు తీసుకోవడం లేదు. రోడ్లు, వీధుల్లో, గల్లీలో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. వెంటనే కట్టడి చర్యలు తీసుకోవాలి.

– పెంద్యాల శ్రీనివాస్, బెల్లంపల్లి

కార్యాచరణ తయారు చేస్తున్నాం

మున్సిపాలిటీలో వీధి కుక్కల నియంత్రణ కోసం కార్యాచరణ తయారు చేస్తున్నాం. వీధి కుక్కల సంతానోత్పత్తిని నివారించడానికి నిధుల సమస్యను దృష్టిలో పెట్టుకొని తగిన విధంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నాం. ఓ ప్రైవేట్ వ్యాన్ యజమానితో ఒప్పందం చేసుకొని, శునకాలను మంచిర్యాలకు తీసుకెళ్లి అక్కడ శస్త్ర చికిత్సలు చేయించాలని సంకల్పించాం. ఆ తీరుగా చేయడం వల్ల తక్కువ వ్యయం అవుతుంది. త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభిస్తాం.

– కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

బొట్లకుంట భూమిని కాపాడండి..!

- కబ్జాకు గురవుతోందని ప్రజల ఆరోపణ
- సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని వేడుకోలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



బొట్లకుంట శివారులో శిఖం భూమి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో సుమారు అరవై ఏళ్ల చరిత్ర కలిగిన బొట్లకుంట విస్తీర్ణం కబ్జాకు గురై కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. నిజాం ప్రభువుల కాలంలో బొట్ల కుంటను తవ్వించినట్లు పూర్వీకులు తెలుపుతున్నారు. కుంట విస్తీర్ణం తగ్గిందని, చుట్టూ ఉన్న శిఖం, ఎఫ్‌టీఎల్ భూమి ఆక్రమణకు గురవుతుందని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వే చేసి సరిహద్దులు గుర్తించి, బొట్లకుంట భూమిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

బొట్ల కుంట విస్తీర్ణం..

పట్టణ శివారులోని ప్రభుత్వ భూమి 261సర్వే నంబరులో 12ఎకరాల ఇరవై ఎనిమిది గుంటల శిఖం విస్తీర్ణం ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. కడెం ప్రాజెక్టు 37డిస్ట్రిబ్యూటరీ నుంచి కాలువ ద్వారా కుంటలోకి నింపేవారు. అప్పటి రికార్డుల ప్రకారం కుంట కింద ఆయకట్టు తూము, మత్తడి ద్వారా సుమారు రెండువందల ఎకరాల వ్యవసాయ భూమి సాగయ్యేది. ఆయకట్టు కింద పంట పొలాలకు సాగుకు బొట్లకుంట నీటిని అందించేవారు. మత్తడి కూలిపోవడం, తూములు పనిచేయకపోవడం, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రదేశం కబ్జాకు గురవుతుంది. ప్రస్తుతం కుంట విస్తీర్ణం, లోతు తగ్గడంతో కనీసం యాభై ఎకరాల వ్యవసాయ భూమిని కూడా సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. కడెం కాలువ శిథిలావస్థకు చేరగా మరమ్మతు చేపట్టకపోవడంతో నీటి సరఫరా కూడా రావడం లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా ఏర్పాటు చేసి, అమ్మకాలు జరిపినట్లు తెలుస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని బొట్లకుంట శిఖం, ఎఫ్‌టీఎల్ భూమికి హద్దులు వేసి కబ్జా అయిన ప్రదేశంపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సర్వే చేపట్టాలి

బొట్లకుంటను సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలి. ఏళ్లుగా ఉన్నటువంటి కుంటను కాపాడేందుకు ఇరిగేషన్ అధికారులు కృషి చేయాలి. పురాతన కుంట కావడంతో పూర్వవైభవం వస్తుంది. ఇరిగేషన్ అధికారులు పట్టించుకొని వెంటనే కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాలి.

- ఎంబడి తిరుపతి, పట్టణ వాస్తవ్యుడు

చర్యలు తీసుకుంటాం

బొట్లకుంట విస్తీర్ణాన్ని త్వరలో సర్వే చేసి శిఖం, ఎఫ్‌టీఎల్ ప్రదేశాన్ని నిర్ణయిస్తాం. భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కుంట నిండ నీరు ఉండడంతో సర్వే చేయడం ఇబ్బందిగా ఉంటుంది. త్వరలోనే పూర్తి చేస్తాం.

- ప్రణీత్, ఇరిగేషన్ జేఈ, లక్సెట్టిపేట

పిచ్చి కుక్కలకు స్టెరిలైజేషన్



పిచ్చి కుక్కలను తరలిస్తున్న అధికారులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో పిచ్చి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 20పిచ్చికుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు మంచిర్యాలకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని వినతి

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మెయిన్ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను పూడ్చాలని శనివారం గొల్లపల్లి గ్రామస్తులు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుంతలలో మురికి నీరు నిలిచి దుర్వాసన వస్తుందని, ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గుంతలను పూడ్చాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఇందూరి రమేష్, గడ్డం తిరుపతి, జాడి నారాయణ, ముదాం రమేష్, వేల్పుల మొగిళి, ఇందూరి సురేష్‌లు పాల్గొన్నారు.

సమాచారం

ఫార్మాసిస్టు, కాంపౌండర్ పోస్టులకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద, ఆయుష్ విభాగంలో ఖాళీగా ఉన్న 9 కాంపౌండర్/ఫార్మాసిస్టు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో 1:3 రేషియోలో అభ్యర్థులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 22వ తేదీ ఉదయం 11గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, 1:3 అభ్యర్థుల జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రచురించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



వంశీకృష్ణ

మందమర్రిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పిట్టల వంశీకృష్ణ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ తెలిపారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన 68వ జోనల్ లెవల్ కరాటే పోటీల్లో అండర్ 50కేజీల విభాగంలో వంశీకృష్ణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే 68వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వంశీకృష్ణ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని, ఉపాధ్యాయులు అభినందించారు.

28 వరకు డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

బెల్లంపల్లి: డిగ్రీ విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించడానికి గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 1, 3, 5వ సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజులను పొడిగిస్తూ కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సులపై ఇంటర్న్‌షిప్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులకు దసరా సెలవుల్లో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మల్టీమీడియా విభాగంలో మేదరిపేట శ్రీసాయి కంప్యూటర్స్‌లో, హెల్త్‌కేర్ విభాగంలో లక్సెట్టిపేట పీహెచ్‌సీలో 10రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వీరితో శిక్షకులు సయ్యద్ సబ్దార్, వసంత, హిమాసాగర్ పాల్గొన్నారు.

23నుంచి బెల్లంపల్లి పట్టణ భరోసా బాట



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పన, నిరుద్యోగ యువతీ యువకులకు సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బెల్లంపల్లి పట్టణ భరోసా బాట కార్యక్రమం ఈ నెల 23 నుంచి నవంబర్ 8 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ కమిటీ నాయకులు తెలిపారు. స్థానిక తిలక్‌స్టేడియంలో శనివారం పట్టణ భరోసా బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా బస్తీల్లో గుర్తించిన సమస్యలను నివేదిక రూపంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, ప్రభుత్వ శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక ముఖ్య సలహాదారులు చిన్నరాజం, శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, ఉపాధ్యక్షులు రాయలింగు, గోపి, కార్యదర్శులు చంద్రశేఖర్, శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపులు



పద్మశాలి కాలనీలో డంపు చేసిన ఇసుక



రోడ్డుపై వేసిన ముళ్లకంప

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కొందరు అక్రమార్కులు రాళ్లవాగును తోడేస్తున్నారు. వాగులోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి స్థానికంగా కుప్పలుగా పోస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ తంతు జరుగుతుండడం, ఉదయం వేళ డంపు చేసిన చోటు నుంచి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాళ్లవాగు నుంచి ఇసుక తెస్తున్న రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో స్థానికులు ఆ రోడ్లపైకి ట్రాక్టర్లు రాకుండా ముళ్ల కంపలను వేస్తున్నారు. ఇసుక డంపులను అధికారులు స్వాధీనం చేసుకుని, వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

ఐకేపీ సభ్యులకు చీరలు పంపిణీ



భీమారంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీవో,ఏపీవో



జెండావెంకటాపూర్‌లో...

లక్సెట్టిపేట/భీమారం/నెన్నెల: మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందజేసిన చీరలను శనివారం అందజేశారు. లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటాపూర్, తలమల, భీమారం మండల కేంద్రంలో, నెన్నెల మండలంలోని గంగారాం గ్రామంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. త్వరలో అన్ని మండలాల్లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో లక్సెట్టిపేటలో కార్యదర్శి హరికృష్ణ, ఐకేపీ సిబ్బంది సుమలత, మల్లేష్, మొగిళి, భీమారంలో ఎంపీవో సతీష్ రెడ్డి, ఏపీఎం త్రియంబక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సీసీ దర్శనాల శంకర్, నెన్నెలలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జాడి రాజ్‌కుమార్, ఐకేపీ సీఏ సమ్మక్క, సంఘం సభ్యులు సుమలత, నాయకులు దేవేందర్, అశోక్, అంకయ్య, అంకులు, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మందమర్రిరూరల్: ఈ నెల 21న పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సింగరేణి హైస్కూల్ విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఏఎస్సై మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం, హోంగార్డ్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

భీమిని: కన్నెపల్లి ప్రాథమిక పాఠశాలలో వసతులు కల్పించాలని శనివారం విద్యార్థుల తల్లితండ్రులు అధికారులకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో కట్టిన మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయని, వెంటనే మరుగుదొడ్ల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

దండేపల్లి: మండలంలోని రంగంపల్లె గ్రామంలో గల బీరయ్య దేవుడి ఆలయ అభివృద్ధికి గూడెం గ్రామ మాజీ ఎంపీటీసీ ముత్తె నారాయణ రూ.10వేలు శనివారం విరాళంగా అందించారు. కార్యక్రమంలో స్థానిక యాదవులు పాల్గొన్నారు.

'గ్రామసభ లేకుండానే ఇందిరమ్మ కమిటీలు'

తాండూర్: ఇందిరమ్మ గ్రామకమిటీలను గ్రామ సభ నిర్వహించకుండానే ఏర్పాటు చేస్తున్నారని మండల బీజేపీ నాయకులు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

రక్తకణాల అందజేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన న్యాయవాది కొట్టె నటేశ్వర్ అత్యవసర సమయంలో తన రక్తకణాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డెంగీతో చికిత్స పొందుతున్న రోగికి రక్తకణాలు తగ్గిపోవడంతో, అత్యవసరంగా శనివారం 28వ సారి రక్తకణాలను అందించారు.